నూతన షాపింగ్ మాల్ ప్రారంభం


షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న సుమ కనకాల

అత్తాపూర్: అత్తాపూర్‌లోని మెట్రో పిల్లర్ నెంబర్ 142కి ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన మంగళగౌరీ షాపింగ్ మాల్‌ను నటి ఫరియా అబ్దుల్లా, ప్రముఖ యాంకర్ సుమ కనకాల ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్తాపూర్ పరిసరాల వారు తమ అభిరుచులు, అవసరాలకు సరిపడే వైవిధ్యభరిత వస్త్ర, వస్తు శ్రేణికోసం మంగళగౌరీ షాపింగ్ మాల్‌ను సందర్శించి అపురూపమైన షాపింగ్ అనుభూతిని పొందగలరన్నారు. వివాహాది శుభ కార్యాలయాలు, ప్రత్యేకమైన వేడుకలకు మంగళగౌరీ షాపింగ్ మాల్ ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరాలో ప్రెషర్ పెంచాలి

బండ్లగూడ : నీటి సరఫరాలో జాప్యం లేకుండా నీటి ఎద్దడిని తీర్చాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ సూచించారు. రానున్న రోజుల్లో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఎర్రకుంట వద్ద జలమండలి జీఎం, మేనేజర్‌తో సమావేశమయ్యారు. లైన్‌మెన్‌లకు సరిపడే బూస్టర్‌లను పెట్టించి నీటి సరఫరా చేసే గంట వరకు ప్రెషర్‌తో వదలాలన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించాలి..

బండ్లగూడ : ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని


జలమండలి అధికారులతో మాట్లాడుతున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

పాత మసీదు ప్రాంతంలో డ్రైనేజీ లీకేజీలను ఆయన పరిశీలించారు.త్వరితగతిన డ్రైనేజీ లీకేజీ కాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మసీదు ప్రాంతంలో మురుగు నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

బీఆర్ఎస్ ఖాళీ.. కాంగ్రెస్‌లో జోష్

శేరిలింగంపల్లిలో మారిన రాజకీయ సమీకరణాలు • ఒకే ఒరలో రెండు కత్తులు ఇమిడేనా

గచ్చిబౌలి: పార్లమెంట్ ఎన్నికల వరకు ఎంతో పటిష్టంగా ఉన్న బీఆర్ఎస్ కాంగ్రెస్ ఆపరేషన్ ఆకర్ష్‌తో ఖాళీ అయ్యింది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ భారీ మెజార్టీతో మూడోసారి విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఎమ్మెల్యే, 9 మంది కార్పొరేటర్లతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఎంతో పటిష్టంగా కనిపించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ కొలువుదీరడం, పార్లమెంట్ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓడిపోవడంతో ఎమ్మెల్యే గాంధీ చూపు కాంగ్రెస్ వైపు మళ్లింది. కొద్ది రోజులుగా నాన్చుడు ధోరణితో వ్యవహరించిన ఆయన శుక్రవారం పార్టీ మారుతున్నట్లుగా స్పష్టం చేశారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ అధిష్టానం బుజ్జగింపులు ఫలించలేదు. రాత్రి కేటీఆర్ స్వయంగా ఫోన్ చేసినా గాంధీ స్పందించలేదని తెలిసింది. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో పార్టీ క్యాడర్‌తో కాంగ్రెస్‌లో చేరారు. 2014లో టీడీపీ నుంచి గెలుపొందిన గాంధీ, 2018లో టీఆర్ఎస్ నుంచి గెలిచారు. 2023లో బీఆర్ఎస్ అభ్యర్థిగా భారీ మెజారిటీతో గెలుపొందారు. నేడు పార్టీని వీడటంతో శేరిలింగంపల్లిలో బీఆర్ఎస్ ఖాళీ అయ్యింది.

త్వరలో మరికొందరు..?

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెంట శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో పాటు డివిజన్ల అధ్యక్షులు, ముఖ్య నాయకులు కాంగ్రెస్‌లో చేరిపోయారు. త్వరలో హైదర్‌నగర్ కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు, చందానగర్ కార్పొరేటర్ మంజుల, వివేకానందనగర్ కార్పొరేటర్ మాధవరం రోజా కాంగ్రెస్‌లో


పార్టీ క్యాడర్‌తో కాంగ్రెస్ పార్టీలో చేరిన శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ

చేరనున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ కార్పొరేటర్ జగదీశ్వర్‌గౌడ్, ఆయన సతీమణి పూజిత కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. కాగా బీఆర్ఎస్ శేరిలింగంపల్లిలో గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా ఒక్కరే మిగిలారు. ఉద్యమ కారులు, బీఆర్ఎస్ సానుభూతి పరులు ఉన్నప్పటికీ క్యాడర్‌ను ఎవరు నడిపిస్తారనే చర్చ జరుగుతోంది. పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీకి 80 వేల మెజార్టీ రావడం, బీఆర్ఎస్ మూడవ స్థానానికి పరిమితం కావడం ఆ పార్టీ శ్రేణులకు ఆందోళన కల్గించింది. ఇక బీఆర్ఎస్ జెండాను ముందుండి ఎవరు మోస్తారో వేచి చూడాల్సిందే.

ఒకే ఒరలో రెండు కత్తులు

బీఆర్ఎస్ నాయకులంతా ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగిన జగదీశ్వర్‌గౌడ్ బీఆర్ఎస్ అభ్యర్థి గాంధీ చేతిలో ఓటమి పాలయ్యారు. గాంధీ చేరికను గౌడ్ వర్గం వ్యతిరేకిస్తూ అసమ్మతి నేతగా మిగిలే అవకాశం ఉంది. ఇంచార్జీగా ఉన్న జగదీశ్వర్ గౌడ్, ఎమ్మెల్యే గాంధీ కలిసి పని చేస్తారా లేక వర్గ పోరును కొనసాగిస్తారా అనేది వేచి చూడాలి. 2029 నాటికి నియోజకవర్గాల పునర్విభజనలో శేరిలింగంపల్లిని రెండు నియోజకవర్గాలుగా చేసినా అప్పటి పరిస్థితులు ఎలా మారతాయో.. కాంగ్రెస్‌లో ఆరెకపూడి గాంధీ చేరికతో జగదీశ్వర్ గౌడ్ పరిస్థితి ఏంటనే చర్చ స్థానికంగా జరుగుతోంది. వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకునే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

వారాహి రూపంలో అమ్మవారు



వారాహి నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా బుద్వేల్ కోట మైసమ్మ తల్లి శ్వేత వారాహి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది. తెల్లవారుజాము నుంచి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనార్థం వందలాది భక్తులు ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు. – రాజేంద్రనగర్

విద్యార్థినికి ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

మణికొండ : వాసవి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు యాదగిరి పేద విద్యార్థినికి ఆర్థిక సాయం అందించారు. 6వ తరగతి చదువుతున్న అక్షిత కుటుంబ ఆర్థికంగా ఇబ్బందులు ఉండటంతో పాఠశాలకు వెళ్లడం మానేసింది. విషయం తెలుసుకున్న యాదగిరి శనివారం రూ.6 వేలు ఆర్థిక సహాయం అందించారు. తమ సంస్థ ఆధ్వర్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు తాము ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్, బ్రహ్మానందం పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలోని సీఐఎస్ఎఫ్ ఉద్యోగుల కుటుంబాల కోసం వారి క్వార్టర్స్ వద్ద శనివారం హుడా కాలనీ ఫ్రాన్సిస్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన వచ్చింది. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు ఆస్పత్రి సీఈఓ డాక్టర్ సుదీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐఎస్ఎఫ్ కమాండెంట్ కుమార్ అభిషేక్, సుగ్నారామ్, సూరజ్ సాహు పాల్గొన్నారు.

స్వలాభం కోసమే పార్టీలు మారుతున్న ఎమ్మెల్యే


మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: స్వలాభం కోసమే పార్టీలు మారుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని బీజేపీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత 15 ఏళ్ల నుంచి నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఓటర్లను నమ్మించి మోసం చేస్తున్నారన్నారు. అభివృద్ధి పేరుతో కార్యకర్తలను మోసం చేస్తున్నారని తమ ఆస్తులను కాపాడుకోవడానికి అధికారంలో ఉన్న పార్టీలలో చేరుతున్నారన్నారు. శంషాబాద్, కోకాపేట్, పెద్ద గోల్కొండ గ్రామాలలో అనేక రకాల భూములను పేదల నుంచి తక్కువ ధరకు తీసుకొని కోట్ల రూపాయల ఆస్తులను సంపాదించారని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో ఉండి ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు జనార్ధన్, జోగి రవి, తిరుపతి రెడ్డి, రామకృష్ణ, బుచ్చిరెడ్డి, ఎల్‌వీ రెడ్డి, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

రాజేంద్రనగర్ : కాంగ్రెస్ పార్టీలో చేరిన రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు శనివారం సన్మానించారు. కాంగ్రెస్ పార్టీ బుద్వేల్ గ్రామ అధ్యక్షుడు కోరని శ్యామ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కానుందని వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పలుగు చెరువు మహేష్, కోరని నరేందర్ తదితరులు ఉన్నారు.

కేంద్రమంత్రికి సన్మానం



బండ్లగూడ : బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ ప్రశాంత్‌నాయక్, భూపాల్‌గౌడ్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను శనివారం కలిసి సన్మానించారు. ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రిని శాలువాలతో సత్కరించారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీని బలోపేతం చేసేందుకు కార్పొరేటర్లు కృషి చేయాలని బండి సంజయ్ వారికి సూచించారు.



నూతన కమిటీ ఏకగ్రీవం

రాజేంద్రనగర్ : ఆషాఢ మాసంలో పోచమ్మ తల్లికి ఘనంగా బోనాల ఉత్సవాలను నిర్వహిస్తామని నూతన కమిటీ అధ్యక్షుడు రజినీకాంత్‌గౌడ్ అన్నారు. డివిజన్ బుద్వేల్ గ్రామంలోని పోచమ్మ తల్లి దేవాలయం నూతన కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శ్రీధర్‌గౌడ్, రాముగౌడ్, రాందేవ్‌రెడ్డి, జగదీష్‌వర్మ, బాబురావు, కుమార్‌ను ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా నరేష్‌యాదవ్, కోశాధికారిగా యాదగిరి గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా సాయిసాగర్, ధన్‌రాజ్, కిరణ్‌యాదవ్, సంతోష్‌గౌడ్, నరేందర్‌గౌడ్, రమేష్‌ముదిరాజ్, వేణుగోపాల చారి, నరేష్‌గౌడ్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా అశోక్, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్, సంతోష్‌చారి, జన్‌గౌడ్, పవన్, సందీప్‌లను ఎన్నుకున్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు

శంషాబాద్: మాదక ద్రవ్య నియంత్రణలో భాగంగా శంషాబాద్ పట్టణంలో పోలీసులు గత పదిహేను రోజులుగా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నారు. శనివారం సాయంత్రం శంషాబాద్ ఏసీపీ కె.ఎస్ రావు, ఆర్‌జీఐఏ సీఐ బాలరాజు నేతృత్వంలో నాలుగైదు బృందాలుగా ఏర్పడి పాన్‌షాప్‌లు, లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టారు.

గోదాం యజమానిపై చర్యలు తీసుకోవాలి



అత్తాపూర్ : గృహ సముదాయాల ప్రాంతంలో గోదామును నిర్వహిస్తూ ప్రమాదాలకు కారణమైన యజమానిపై చర్యలు తీసుకోవాలని మహమ్మద్ ముస్తాక్ పోలీసులను ఆశ్రయించాడు. గత కొన్ని సంవత్సరాలుగా మక్బుల్ అనే వ్యక్తి అక్రమంగా కట్టెల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. సామర్థ్యానికి మించి కట్టెలు గోదాం ఉండడంతో శనివారం గోదాం సమీపంలో ఉన్న ముస్తాక్‌కు గృహ నిర్మాణానికి చెందిన ప్రహరీ కూలిపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళ అదృశ్యం


మల్లీశ్వరి

మైలార్‌దేవ్‌పల్లి : ఇంటి నుంచి బయటికి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వినాయక్ నగర్ ప్రాంతానికి చెందిన రాజ్‌కుమార్, మల్లీశ్వరి దంపతులు కూలిపనులు చేస్తుంటారు. ఈ నెల 7న వాకిలి సరిగా శుభ్రం చేయలేదని అత్త మల్లీశ్వరితో గొడవ పడింది. కాసేటి తర్వాత బయటికి వెళ్లిన మల్లీశ్వరి రాత్రైనా ఇంటికి రాకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బోనాలకు భారీ బందోస్తు

గోల్కొండ: గోల్కొండ కోట మూడవ బోనం పూజకు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ పోలీస్‌స్టేషన్ వద్ద మూడవ బోనం పూజ కోసం తీసుకుంటున్న ఏర్పాట్లపై మాట్లాడారు. మొబైల్ పోలీస్ టీమ్‌లను ఏర్పాటు చేసి భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కోటకు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోల్కొండ ఫతేదర్వాజా, ఆషూర్‌ఖానా, రాందేవ్‌గూడ రోడ్డు, బంజారి దర్వాజ, చోటాబజార్, బడా బజార్, గోల్ఫ్ కోర్టు సమీపంలోని జమాలీ దర్వాజా తదితర ప్రాంతాల్లో పోలీసు క్యాంపులను ఏర్పాటు చేశామన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

బండ్లగూడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాటు పడుతూ అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం కార్పొరేషన్ పరిధిలోని 15వ డివిజన్ శాంతినగర్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రోడ్డు పనుల్లో ఎలాంటి సమస్యలు ఎదురైనా తన దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టింకురెడ్డి, నాయకులు దశరథ్, కుమార్‌యాదవ్, కాలనీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న పూలపల్లి రాజేందర్‌రెడ్డి

కాంగ్రెస్ హయాంలోనే శంషాబాద్ అభివృద్ధి


కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్

శంషాబాద్ : శంషాబాద్ విమానాశ్రయంతో పాటు ఔటర్ రింగురోడ్డు లాంటి అతి పెద్ద అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని కౌన్సిలర్ జహంగీర్‌ఖాన్ గుర్తు చేశారు. బీఆర్ఎస్‌ను వీడి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు మరింత అభివృద్ధి కోసమే బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి పెద్ద పీట వేస్తోందన్నారు.

సమాజాభివృద్ధిలో సైన్స్ కీలకం


మాట్లాడుతున్న శాంతారావు

గచ్చిబౌలి: సమాజాభివృద్ధిలో సైన్స్ కీలకపాత్ర పోషిస్తుందని ప్రముఖ సాహితీవేత్త, సామాజిక కార్యకర్త శాంతారావు పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలిలోని సుందర్య విజ్ఞాన కేంద్రంలో జన విజ్ఞాన వేదిక హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో సైన్స్-సమాజం అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక అభివృద్ధి పెరుగుతున్న కొద్దీ మానవ సంబంధాలు నిర్వీర్యం అవుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. పిల్లలో భౌతిక, మానసిక, సాంఘిక పరమైన ఆరోగ్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అశాస్త్రీయమైన అభివృద్ధి కార్యక్రమాల వల్ల ఆర్థిక అసమానతలు తలెత్తుతున్నాయని జన విజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షులు చంద్రశేఖరరావు అన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక గచ్చిబౌలి శాఖ అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం.భరత్, ప్రధాన కార్యదర్శి రవీంద్ర బాబు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సంగీత కచేరి



మాదాపూర్: అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీరామ సంగీత పాఠశాల విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. శ్రీరామ సంగీత పాఠశాల గురువు జొన్నలగడ్డ మాధురి శిష్యులు కేశవ హరిచరణ్, స్వేచ్ఛ రెడ్డి, వైష్ణవి, వందిత్య, ప్రతీక్ష్య, తరుణ్ బాలాజీ, శ్రీకృతి, లలిత, శరణ్య, లలితసౌజన్యలు పాల్గొని గోవింద గోవింద, ఎండగాని నీడగాని, శరణుశరణు, తిరుమలగిరిరాయ, ఆరగించి కూర్చున్న, తందనానాఅహి కీర్తనలు ఆలపించారు. కీబోర్డు మారుతీకిరణ్, తబలా శ్రీనివాస్ వాయిద్య సహకారాన్ని అందించారు.

కూచిపూడి నృత్యప్రదర్శన



మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం తన్మయి ఆర్ట్ స్టూడియో శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. దుబాయ్‌లో భారతీయులకు, విదేశీయులకు నృత్యంలో శిక్షణ ఇస్తున్న నాట్యగురువు ప్రీతి తాతంబోట్ల వద్ద దుబాయ్‌లో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందిన శిష్యులు రామాస, లక్ష్మి, మనోజ్ఞ, ప్రవళిక, వైష్ణవి, వీక్షితా, హ్యాంవిత, లాలనశ్రీ, సాన్విరెడ్డి తదితరులు ప్రదర్శన ఇచ్చారు. ఇందులో గణేశ పంచరత్న, రామాయణశబ్దం, స్వాగతం కృష్ణ, అబాష్టకం, బాల కనకమయ, నంద నందన గోపాల, అంశాలను ప్రదర్శించారు. –మాదాపూర్

దోమల నివారణపై స్పెషల్ డ్రైవ్



గోల్కొండ: దోమల వ్యాప్తికి అడ్డుకట్ట వేస్తే డెంగీ, మలేరియా లాంటి ప్రమాదకర వ్యాధులను అరికట్టవచ్చునని బల్దియా ఎంటమాలజీ విభాగానికి చెందిన రాజ్‌కుమార్ అన్నారు. శనివారం గోల్కొండ నయాకీలాలోని ఉర్దూ హై స్కూల్‌లో దోమల నివారణ, విష జ్వరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. బల్దియా ఎంటమాలజీ విభాగం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో దోమల నివారణ కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తుందన్నారు. ఇందులో భాగంగా పాఠశాలల్లోని తరగతి గదులు, టాయిలెట్స్, స్టోర్ రూమ్స్ ఈ విధంగా పాఠశాల మూలమూలాని దోమల నివారణ మందులను స్ప్రే చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ప్రశంస పత్రాలు కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు.

జగన్నాథ రథయాత్ర ప్రారంభం





మణికొండ: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీలో శనివారం జగన్నాథ మొదటి రథయాత్రను ఘనంగా నిర్వహించారు. రథయాత్ర విశిష్టత గురించి ఇస్కాన్ ప్రతినిధులు పల్లవి మాతాజీ, కిరణ్ ప్రభుజీ, లావణ్య మాతాజీ, గిరిరాజ్ దాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డి, పంచవటి కాలనీ అధ్యక్షుడు సీతారాం, రామాలయం ట్రస్ట్ అధ్యక్షుడు లక్ష్మీ నారాయణ, నాయకులు రామారావు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ : రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పురవీధులలో శనివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్ర ఘనంగా సాగింది. ఇస్కాన్ దేవాలయం నుంచి ఉప్పర్‌పల్లిలోని సామభూపాల్‌రెడ్డి గార్డెన్ వరకు నిర్వహించిన రథోత్సవంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. స్వామి రథాన్ని లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. గార్డెన్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామివారికి హారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పాతబస్తీలో విద్యుత్ అధికారుల పర్యటన

చార్మినార్: టీజీఎస్పీడీసీఎల్ దక్షిణ మండలం ఎస్ఈ మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి శనివారం పాతబస్తీలో పర్యటించారు. ఆస్మాన్ గడ్ డీఈ హనుమంత్ రెడ్డితో పాటు మరికొంత మంది అధికారులతో కలిసి పాతబస్తీలోని డబీర్‌పురా, బీబీ కా అలావా, చార్మినార్, గుల్జార్‌హౌస్, దారుషిఫా, చాదర్‌ఘాట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి విద్యుత్ సరఫరాతో పాటు ఎక్కడైనా ఏవైనా విద్యుత్ సరఫరాలో అంతరాయాలు కలుగుతున్నాయా..అనే విషయాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మొహర్రం సంతప దినాలు కొనసాగుతున్నందున విద్యుత్ సరఫరాలో ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఈ సంబంధిత విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా డబీర్ పురా లోని బీబీ కా అలావా నుంచి నిర్వహించే పదో మొహరం సంతాప దినాల సామూహిక ఊరేగింపును పురస్కరించుకొని ఆయా రూట్ ను పరిశీలించారు. డబీర్‌పురా నుంచి బయలుదేరిన అధికారుల బృందం చార్మినార్, మదీనా చౌరస్తా, దారుషిఫా ద్వారా చాదర్‌ఘాట్ వరకు అధికారులు మొహర్రం రూట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ పాండే, ఏఈలు భాస్కర్, శీను తదితరులు పాల్గొన్నారు.

